# ఉచితవిందు

[గల్పిక]

ఆ ఉదయం పదింటికే నారాయణరావు జేబులో ఉన్న ఆఖరు కానీ, అయిపోయింది. అది పెట్టి అతను మౌంటురోడ్డు ఉడిపి హోటల్లో అయిసువాటరు తాగేశాడు.

అయిసువాటరు రెండు గంటలకన్న ఆకలి ఆపలేదనే సంగతి అందరికీ తెలుసు. మౌంటురోడ్డు షాపుల్లో ఒక్కొక్క గడియారమే పన్నెండు కొడుతుంటే నారాయణరావు కడుపు మండిపోతున్నది. "ఈక్షణాన ఎవరన్నా నాకు విందు చెయ్యకూడదా?" అనుకున్నాడు నారాయణరావు. "ఒక్క విందుకు సులభంగా తట్టుకోగలను!"

చక్కని సూటు వేసుకుని ఆ ఓదూరం నడవటంలో అర్థం లేదు. అందుచేత గడిచిన రెండు గంటలకాలంలోనూ అతను ఉడిపి హోటలు దగ్గిర్నించి వెల్లింగ్టను సినిమావరకు మాత్రమే జరగగలిగాడు.

ఈ రెండు గంటలకాలం లోనూ అతను గమనించిన వింత ఏమంటే, తన జేబులో ఆఖరుకానీ అయిసువాట రయిపోయిన తరవాత కూడా మద్రాసుపట్నంలో ఇన్ని బస్సులూ, ట్రాంలూ, టాక్సీలూ, ప్రైవేటుకార్లూ, రిక్షాలూ. యథాప్రకారం నడుస్తూ ఉండటమూ, వాటిల్లో ఎక్కిన కొందరు కొందరాడవాళ్ళ మొహాలు చాలాఅందంగా ఉండగలగటమూనూ!

ఆడవాళ్ళ అందంతో కడుపులు నిండేటట్టయితే మద్రాసులో హోటళ్లూ, కాఫీహోటళ్ళూ దివాలామే!...కరకరా

ఆకలి అయితేగాని అన్నం తినవద్దంటారు వైద్యులు. కరకరా ఆకలవుతుంటే ఎంత అసహ్యంగా ఉండేదీ, పాపం, ఆవైద్య తెరగరు! ఆకలికి భయపడని వాళ్లు ప్రోలిటేరియనులు. తనకు ఆస్తిలేదు, ఉద్యోగంలేదు. కాని తను ప్రోలిటేరియను కాదు. అంచాతే తనకు ఆకలంటే భయం...

పక్కనే ఉన్న ఇరానీ హోటలు నుంచి ఎవరో బొర్ర నిమురుకుంటూ బయటికొచ్చారు. ఇక తను వెనకాడి లాభం లేదు. నారాయణ లోపలప్రవేశించి కౌంటరు దగ్గి రాగాడు.

"ఏంకావాలి?" అన్నాడు గల్లామనిషి.

ఒక టూత్‌పేస్ట్‌ట్యూబూ, బ్రషూ, ఒకసబ్బూ, ఒక పెట్టె సిగిరెట్లూ, నిప్పుపెట్టే, ఒక అరపౌను బిస్కట్లూ కొని పార్సెలుకట్టించి, చంకలోపెట్టుకుని నారాయణరావు, "కాస్త చా తాగి ఇప్పుడే వస్తాను. బిల్లు రాసి ఉంచండి!" అంటూ లోపలికి వెళ్లాడు. కాస్త చా అనుకున్నది కాస్తా ఆరణాల విందైంది. వెయిటరు బిల్లు తెచ్చిఇచ్చి వెళ్ళిపోయినాడు.

నారాయణరావు లేచే ప్రయత్నం చెయ్యక, అంతకుపూర్వమే కొన్న సిగిరెట్టుపెట్టె తెరిచి ఒక సిగిరెట్టుతీసి అంటించి, పీల్చి, పెద్దపెట్టున దగ్గసాగాడు. దగ్గుతూనే లేచి అతను గబగబాబయటికివచ్చాడు. అతసవస్తువులుఅతనుకూచున్నచోటే ఉండటం చూసి వెయిటరు సంతృప్తి పడ్డాడు. అతనూ ఉప్పెనగా దగ్గుతూ బయటికి పోవటంచూసిన గల్లామనిషి అతను కొన్న వస్తువులు వెంటలేకపోవటం చూసి తృప్తిపడ్డాడు.

నారాయణ మళ్లీ వెనక్కొచ్చి బిల్లుచెల్లించటం మరిచాడు.

———